# వర్షించని మబ్బులు

కె. వి. యస్. అచ్యుతవల్లి

వంటపని పూర్తిచేసుకొని చేయి తుడుచు కుంటూ అరుగుమీదకువచ్చి నిలబడింది అనుసూయ. ఆకాశం అంతా మబ్బులు పరుచుకొని గాలివేయకుండా కనీసం అస్తమయ సూర్యకాంతి అయినా లోకంమీద పడనీయకుండా చేస్తున్నాయ్. అనసూయ అసలే వంటింట్లోంచి వచ్చిందేమో! బయట కూడా ఈ వాతావరణము చూసేసరికి ఆమెలో అంతవరకూ అంతర్యంలో గూడు కట్టుకొన్న నిరాశ నిస్పృహలు పైకి రాసాగినయ్. ముఖంమీద చమటతో తడిసిన ముంగురుల్ని చిరాకుగా రెండు చేతులతోనూ పైకి ఎగద్రోసుకుంటూ జడ మెలిపెడుతున్న అనసూయను జూసి

"అమ్మా? వుక్క బోస్తోందికదే? కాస్తగాలి



కొన్నివానా వస్తే బాగుణ్ను." అంది జానకి.

"గాలి ఒద్దుకానీ వానవస్తే బాగుంటుంది. వెధవగాలి వస్తే నాకేలెండర్లన్నీ తెగి క్రింద పడిపోతాయ్. వెధవగాలి." అన్నాడు రాజాబాబు. వాడు స్నేహితులనడిగి ఎక్కడెక్కడి కేలెండర్లూ తెచ్చుకుంటాడు. అవి పాతవయినాసరే! అన్నీ గోడకు చెక్కు సున్నం మాసికలు కనపడకుండా మేకులు దిగకొట్టి పెడతాడు. పెద్ద పెద్ద కిటికీలవటం నించి ఏమాత్రం గాలి వీచినా అవి దారాలు వూడి క్రిందకు పడిపోతయ్. మళ్ళీ అక్కతో రాజీ పడితేకానీ సూదీదారం చేతికి పట్టదు. తనకు టాకాలు పొయ్యటం రాదు. ఎన్నిసార్లు పరీక్షించినా అది ఇట్లే సూదిగుచ్చి అట్టే పైకిలాగులే కుట్టుపడడం తనకి తెలియటంలేదు. అప్పుడే అది నాన్న చినిగిపోయిన లుంగీని రెండు రుమాళ్ళు కుట్టింది! రావుగారి కమల మిల మిల మెరిసే శాటిన్‌తో కుట్టింది రుమాళ్ళు! అవి బళ్ళో అందరూ మెచ్చుకున్నారు. పాపం! అక్కవి ఎవరూ మెచ్చుకోలేదు. నాన్న ఎప్పుడూ ఇంతే! అక్కకి శాటిన్ కొని ఇవ్వకూడదూ? అమ్మైనా ఈ విషయంలో మహా మంచిదని అనుకోవటానికి వీల్లేదు. "ముందు పాతవాటితో కుట్టు నేర్చుకుంటే తర్వాత కొత్తవి కొనిస్తా" అన్నది. ఏమిటో! ఈ పెద్దాళ్ళ! అన్నిటికీ రేపు రేపు అంటమే కాని ఒక్క పనీ చేయరు. తనకి మూడు చక్రాల సైకిలు కొనమని ఎన్నిసార్లు చెప్పాడు. వినిపించుకుంటేనేనా! హూ తనయితే అలా భస్తే చేయడు. అసలు తను ఇంక అడగనే అడగడు! అక్క అలా కాదు. ప్రతీది అమ్మనీ నాన్ననీ అడుగుతూంటుంది.

"అమ్మా నాకు లంగాలు కావాలి."

రేపు కొనిపిస్తాలే" అని అమ్మ అంటుంది.

"టెక్స్టు బుక్కులు కొనుక్కోమన్నారు మేష్టారు."

"రేపు చూద్దాంలే."

"అమ్మా? నేను సావిత్రితో ఆడు కుందుకు పోవద్దంటే అమ్మా? రేపు వెళ్దువు గానిలే" అన్నిటికీ రేపే! అంచేత తను వాళ్ళని ఏమీ అడగనే అడగడు. తన కిష్టమయి నప్పుడు బళ్ళోకి వెళతాడు. లేనప్పుడు లేదు. తనకి కోపం వస్తే అమ్మ నాలుగు తన్నినా బళ్ళోకి పోనేపోడు. అమ్మ" ఉత్తి తిక్కశంక రాయి వెధవ" అంటుంది. అక్క అలా అమ్మ అజ్ఞకు కట్టుబడి పోతుంటే తనకి చెప్పలేనంత జాలి వేస్తుంది. తనే ఓదార్చాలి! ఇంకెవరున్నారు తను తప్ప దానికి! "ఏమీ అనుకోకే అక్కా! వాళ్ళలానే అంటూంటార్లే! ఇటుచూడు! ఈ మధుబాల కేలెండరు అచ్చంగా తీసేసుకో. "ఏం" అంటాడు. ఎంతో ప్రేమగా.

"ఏడిశావుపోరా వెర్రివెధవా! అంటుంది జానకి. ఇంతే దాని బ్రతుకు! తను ఎంతో ఆపేక్షగా మాట్లాడుతే అది అలా కసురు తూంటుంది. నేను చిన్న వెధవననీ దానికేం చేయలేననీ దాని అనుమానం. కమల రుమాళ్ళు గుడ్డలాంటిది పెద్దది ఓటి తెచ్చిపడేస్తే తెలుస్తుంది. అమ్మాయిగారికి నేనంటే ఏమిటో! ఆకాశం కేసి చూశాడు రాజాబాబు. మబ్బులు నెమ్మదిగా కదుల్తున్నాయ్. అవి సన్నగా దారితీసిన చోట అసురసంధ్య కాంతి ఇవతలికి రావటానికి ప్రయత్నిస్తూ వాటి అంచుల్ని మాత్రం వెలిగించగలిగింది. జానకి అరుగు మీద కూర్చొని రోడ్డుమీద వచ్చేపోయే వారిని చూస్తోంది. అది ఆ పిల్లకు ప్రతిరోజూ అలవాటే! అది ఎప్పుడూ తండ్రి చిటికినేలు పట్టుకొని బజారుకు పోవటం ఎరుగదు! అతను తెచ్చే పూలు మిఠాయిలు అంతకన్నా కొల్లలో లేదు! దానికి కాలక్షేపం సాయంత్రాలు ఇలా అరుగు మీద కూర్చోవటమే! అంచేత అది ప్రతి మనిషినీ విధిగా గుర్తు పెట్టు కుంటుంది. కొంతమందికి ముద్దు పేర్లు పెట్టింది కూడా. అవి తల్లితో చెప్పి నవ్వు కుంటుంది. ముఖ్యంగా దానికి ముగ్గురంటే మహా ఇష్టంగా వుంటుంది. అందులో సైకిలు మీద పోయే తెలుగు మేష్టారు. ఆయన నెత్తిమీద కలుపు తీసేసిన కొత్తి మిరలా వున్న జుట్టూ. అయనను కోడిఈకల మేష్టారుట! ఇంకొకరు దగ్గరలోనే వున్న నాటక కళాశాలకు పోతూ వుంటాడు. అతని కళ్ళు ముక్కుకి అతి దగ్గరగా వుంటాయి. కళ్ళ చూట్టూ బొటనవేలంత వెడల్పుగా నల్లబడి కమిలినట్టుగా వుంటుంది. సన్నగా తెల్లగా పేలగా వున్న అతనిని 'గుంటనక్క హీరో' అంటుంది. ఇంకొకామె రోజూ హిందీ చదువు కుందుకు పోతూంటుంది. ఆమె కనుబొమ్మలు కలుసుకు పోయి వుంటాయి. మోచెంపలమీద జుట్టు వొత్తుగా వుంటుంది. గడ్డం మీద కూడా నూగు నూగుగా వుంటుంది. ఆమెను "అంజనీ సుత" అని సంస్కరించింది. జానకి. మధ్యమధ్య రాజాబాబు రోడ్డుమీద బొంగరాలు ఆడుకుంటూ అరచేతి మీదకు ఎక్కించుకొని చూడు చూడు అక్కా" అంటూ దగ్గరకు వస్తాడు. "పోరా" అంటుంది విసుగ్గా జానికి.

"అక్కా! కిరికి ఆడు కుందామే ఏం తోచటం లేదు." అన్నాడు రాజాబాబు.

"చీకటి పడుతోంది. ఇప్పుడేం కనపడ తుంది నీ మొహం?" అన్నది జానకి.

"లాంతరు వెలిగించుకొని రావే అమ్మా" అన్నాడు రాజాబాబు.

"వెలిగించుకోవద్దన్నానా?" అన్నది పరధ్యా నంగా అనసూయ.

"రావే! ఆడుకుందాంమరి! అన్నాడు వుత్సాహంగా.

"రేపు ఆడుకుందాం లేరా" అన్నది జానకి.

"రేపట రేపు! అమ్మ మాటలు బట్టీవేసి నట్టుగా అంటోంది. ఈ జ్ఞాపక మేదో హిస్టరీ పాఠంవుంటే క్లాసులో బెంచీ ఎక్కక పోను అమ్మాయి!"—అనుకుని ఏం చేయలేక వూరుకున్నాడు.

చీకటి చీకటిగా అవుతోంది. లోకమంతా కారుమబ్బులతో కటిక చీకటి అవుతూంది. మబ్బులు విడాలంటే వాన కురవాలి. అప్పుడు ఆకాశం స్వచ్ఛంగా అందమైన లేత్రాయపు యువతిలా వుంటుంది. వానతో తడిసి ప్రకృతి చాలాసేపు ఏడిచి ఏడిచి తల్లి కనిపిస్తే కిలా కిలా నవ్వుతున్న పసిపాప మొహంలా వుంటుంది. ఆ దృశ్యం మననం చేసుకుంటున్నది అన సూయ.

"అమ్మా? ఇవెళ్టికైక వాన రాదంటా వేమిటే?" అన్నది జానకి ఆవులిస్తూ.

"వస్తుంది. వాన తప్పకుండగా వస్తుంది. కాని ఇక్కడ కురవదు. తన భారమే మోయ లేక లోకాన్ని ముంచెత్తటానికి పరుగెత్తుతున్న సముద్రపు నీరుని ఎక్కువ చేయటానికి పరు గెత్తుతాయ్. ఈ వ్యర్థపు మబ్బులు. తనకోసం తపిస్తూ తనకోసం తలలెత్తి ప్రతిక్షణం ఆశతో తనవెంపు తలలూపి పిలుస్తున్న లేత మొక్కల పిలుపు వాటి కక్కరలేదు. ఈ ప్రపంచంలో వర్షం కురియక వుక్కపెట్టి వుసూరు మనిపించే మబ్బుల వంటివారు చాలా మంది వున్నారు అనుకున్నది అనసూయ. అప్రయత్నంగా మేడ పై భాగానికి దృష్టి పోనిచ్చింది. కిటికీ దగ్గరగా పగులు విచ్చి ఒక రావిమొక్క మొలిచింది. దీన్ని ఎన్నిసార్లు పీకినా మళ్ళీ మళ్ళీ మొలుస్తూనే వున్నది రావణాసురుని తలకాయలా. ఇల్లంతా పాడు పడిపోతోంది. రామ్మూర్తికి ఎప్పుడు ఇంటి ధ్యాస వుండదు. అర్ధరాత్రి ఏ ఒంటి గంటకో వస్తాడు. మళ్ళీ ప్రొద్దుట ఏడింటికి వెళ్ళి పోతాడు. ఇంట్లో ఒకక్షణం నిలబడడు. పెట్లో డబ్బు వున్నపుడు నాలుగు సామాన్లు కొంటూ వండుకుతింటూ పడివుంటారు. ఆ తల్లీ పిల్లలూ, ఆ లంకంత కొంపలో అలా పడివుండాలి. పెళ్ళయిన క్రొత్తలో అన సూయకు భర్త వాలకం ఆశ్చర్యంగానే వున్నా

రాను రానూ అలవాటయినది. ఏదో నిరాసక్తత అతనిలో ఆవహించింది. అది తాను పోగొట్టలేనని తెలుసుకున్నది. క్రొత్తలో వంటరితనం భరించలేక తమ్ముణ్ణి తీసుకవచ్చింది. అత్తవారి బంధువర్గంలో అలజడి చెలరేగింది.

"ఇంకేం? అనసూయ పుట్టింటివారి భాగ్యం బాగానే పండింది. ముందు ఎలాగో కళ్ళు మూసుకుని అయిదువేలు కట్నంతో కోటలాంటి ఇంట్లో పడేశారు. ఇప్పుడు నెమ్మదిగా కాలువ త్రవ్వుతున్నారు." అన్నారు. ఈ మాటలు అ నోటా ఈ నోటా తమ్ముడి చెవిలో పడ్డాయ్. వాడికి ఉక్రోషం వచ్చింది.

"నేనుండలేను—అక్కా మీ ఇంట్లో? నా అత్తారంతా నానా మాటలు అంటున్నారు మమ్మల్ని" అని వెళ్ళిపోయాడు. ఏదో బాధ తనలో. తన కీ పెళ్ళెందుకు చేశారు? ఈ పిల్లలు ఒకళ్ళు తన ప్రాణానికి లేకపోతే ఏం చేసేది? హాయిగా ఇంటరు ప్యాసయింది. ఆ అయిదువేలూ ఫీజు మొహాన్ని పోసి తన కీ తాడు కట్టించకపోతే తన చేతికియ్యకూడదూ? హాయిగా ఏ యం. బి. బి. యస్సో ప్యాస వును. ఉద్యోగమ్సు రాకపు మాత్రం పెళ్ళిళ్ళు చేసుకోటం లేదా? స్వేచ్ఛగా వుండలేక కోరి కోరి ఈ రొంపిలోకి దిగాలనే కోరిక ఎందుకో ఈ స్త్రీలకి? ఏమో తనకి ఇలా అనిపిస్తున్న దని అందరికీ అలానే అనిపిస్తుందా! ఆడపిల్ల కాస్త పెద్దదవ భయం.

"మీ అమ్మాయికి పెళ్ళెప్పుడు చేస్తారు?" అని ప్రశ్న పరంపరలు! అంతే కాని ఆ అమ్మాయికి చేసుకోవాలని వుందో లేదో అని ఆలోచించరు. తల్లితండ్రులూ అంతే! ఎల్లాగో అష్ట కష్టాలూపడి మూడు ముళ్ళూ పడే యించి, చేతులు దులుపుకుంటారు. హు. తనకి మళ్ళీ ఈ ఆ డ పి ల్ల! తన దౌర్భాగ్యపు జీవితానికి ఆడపిల్ల ఒకర్తి! ఏం చేయగలదు? వెర్రిపిల్ల! దాన్నిచూస్తే తనకు జాలీ, భయం! కుర్రాడు మళ్ళీ తండ్రీ పోలికే. అంతకన్నా ఏడాకులు ఎక్కువ చదివేడు. అయినా అంతే

……అనసూయ రవికె చమటతో తడిసింది. భర్తని గురించి ఆలోచిన వచ్చేసరికి ముఖం కళ్ళూ ముక్కూ చమటో కన్నీళ్ళో తెలియకుండా ఏకమయ్యాయ్! ఏదయినా నాలుగూ మాట్లాడుదామన్నా భయం! కారణం లేకుండానే ఇంటికి వచ్చినపుడల్లా ఇక్కడ గిన్నె అక్కడ పెట్టారనే. పెడ బొబ్బలు పెడుతూంటే ఇంక ఇంటి విషయాలు మాట్లాడేది ఎప్పుడూ! తన్ను కలుగజేసికోవద్దంటారు. ఆయనంత ఆయన చూడరు. వచ్చే పోయే వాళ్ళంతా తన్ని అసమర్థురాలి క్రింద జమచేసి మాట్లాడుతూంటే చెవులప్పగించి వూరుకుంటుంది. అనసూయ ఆకాశంకేసి చూసింది.

మబ్బులు దట్టమవుతున్నట్లు కనపడింది. అనసూయకి పొద్దున్న సంగతి జ్ఞప్తికొచ్చింది. పాలవాడు రాలేదు ఆ రోజు.

"కాఫీ అయ్యిందా?" అని గావుకేక పెట్టాడు రామ్మూర్తి.

"పాలులేవు" అన్నది, నెమ్మదిగా.

"ఏమ్! నిన్నే?" అన్నాడు మళ్ళీ.

"లేవని చెప్పేనుగా?" అన్నది. భయంగా.

'లేకపోతే కొను! నే వద్దన్నట్టుగా ఏడుస్తావేం?"

"బాగుంది వరస. కాఫీలో పాలు లేకపోతే కొనాలని తెలియని దానిలా మాట్లాడుతున్నారు" అనుకుంది.

"ఎవరినో ఒకరిని పాడుకపెట్టుకోవాలని తెలీదూ? నువ్వు ఆడదానివేనా?" అన్నాడు. లేవగానే కాఫీ లేనిసణుగుతో.

అనసూయకు చిరాకెత్తిన మాట నిజం!

"మీరు మగవారు అయితే, నేను ఆడదాన్ని కాకేం? అలా ఇంట్లో బొబ్బలుపెడ్తూ కూచోబోతే ఏ హోటల్లోనేనా ఒక కప్పు పాలుకొని తేకూడదూ? ఇవ్వాళ ఎందుచేతో రాలేదు. ఆ వెధవ!" అన్నది, మామూలు భార్య హోదాతో.

అంతే! చేతితోది తలదువ్వుకుంటున్న దువ్వెన అనసూయ ముఖంమీదికి విసిరికొట్టి విసురుగా వెళ్ళిపోయాడు. మళ్ళీ ఇప్పటిదాకా అయిపులేడు!

ఏమయినా తాను ఇంక ఈ—అజా—పజా లేని దిక్కుమాలిన సంసారం చేయలేదు! ఏ వూరయినా పోయి దొరికిన వుద్యోగం చేసుకుంటూ గడిపితే నయం! దృఢ నిశ్చయంతో లోపలికి వెళ్ళింది అనసూయ. పిల్లలిద్దరూ అప్పుడే నిద్రపోతున్నారు గాఢంగా. పెట్టె తెరచి పది రూపాయలు చెంగున కట్టుకుని బయటకు వచ్చింది. ఒక్కసారిగా పిల్లలిద్దరి జ్ఞాపకాలు నూత్న హృదయాన్ని బంధిద్దామని ప్రయత్నించాయ్. అంతకంటె ముందుగానే భర్తమీద వ్యర్థపు కోపము హృదయాన్ని ఆక్రమించటంవల్ల అవి వెనుదిరిగాయ్!

మబ్బులు ఇంకా ఆలోచిస్తున్నట్లున్నాయ్! ఇది వర్షించటానికి అనువయిన చోటు అవునా కాదా ? అని. క్షణం ఆ వ్యథిత హృదయం అల్లకల్లోలమైంది. ఎక్కడా చెట్ల ఆకులు మంత్రం వేసిన వాట్లకు మల్లె కదలటంలేదు. విపరీతమైన ఉక్కగా వున్నది. గబ గబా స్టేషనుకు పోయి కూర్చున్నది. పోర్టర్లు ప్లాటుఫారంమీద కాగితపు విసనకర్రలతో విసురుకుంటూ ఆపసోపాలు పడుతున్నారు. నల్లని త్రాచుల్లా పట్టాలు లైట్ల వెలుతురులో జరజరా ప్రాకుతున్నట్లున్నాయ్! అవి రెండూ ఎంత దూరమో అలా ప్రయాణిస్తాయ్. ఎక్కడా కలవవు. అవునూ! ఎప్పుడూ ఎక్కడా కలవవు. అయినా మనుష్యులకు పుపయోగంగా వుంటున్నాయ్. అలానే లాభిస్తారనా ? ఒకళ్ళ మనసు ఒకళ్ళకు తెలియదు. అతను చెప్పడు. తాను చెప్పటానికి అవకాశమియ్యడు. అయినా ఇంటికి వచ్చేపోయేవారి సంఖ్య మామూలుగానే వుంటుంది. లోకం తమని మామూలుగా వున్నారనుకుంటారు. లోపల్ని వున్నవాళ్ళక్రిందే జమచేసి లెక్కాయిస్తారు.

మబ్బులు వర్షించకపోయినా చూడటానికి ఎంతో బావుంటాయ్! వాటిని చూడగానే పిల్లలు "వానా వానా వెల్లప్ప" లు తిరుగుతారు. వాటిని చూస్తూ మనమూ కాలక్షేపము చేయొచ్చును. రామ్మూర్తిది ఈ తరహా! మబ్బులకు తాము సకాలంలో వర్షించకపోతే మనుష్యులు చిరాకుపడతారని తెలీదు. వాటికి తోచిన రీతిని పరుగెట్టుతాయ్.

"మాకు అలా నచ్చింది. అంచేత అలా పోయాం! మాకు తెలీకుండగా మీకు కష్టం కలిగితే మేమేం జెయ్యను ?" అంటాయ్. రామ్మూర్తి అంతే!

మబ్బులు ముసురుతూంటే వర్షం రావచ్చని ఆశపడ్డట్టే రామ్మూర్తి డబ్బు చూసి తను సుఖపడుతుందని తనవాళ్ళు ఆశించారు. తన దుర్భరమైన బ్రతుకు వాళ్ళకి తెలిస్తే ఎంత బాధపడతారు ? గాఢ సుషుప్తమైన అతని హృదయంనించి "జాగృతి" ని ఆశించటం శుద్ధ పొరపాటు! తను నిరీక్షించలేదు అంతే!

"పాసింజరు ఎన్నింటికండీ!" అన్నది అనసూయ.

"గంట లేటు. రెండున్నరకి రావచ్చు ?" అన్నాడు స్టేషనుమాస్టరు లేవకుండానే.

ప్లాటుఫారంమీదికి వచ్చి నిలబడింది అనసూయ. గన్నేరుచెట్టు క్రింద ఒక భార్యాభర్త, ఇద్దరు పిల్లలు వున్నారు. పిల్లలిద్దరూ నిద్రపోతున్నారు. భార్యాభర్త వేరుశనక్కాయలు వలుచుకుతింటూ కాళ్ళు జాపుకుని కబుర్లాడుకుంటున్నారు. వాళ్ళకు కాస్త దూరంలో ఒక గోనెసంచిమూట తలక్రింద పెట్టుకుని పడుకున్నాడో ముసలి తాత.

"మీరు ఈ బండికేనా అమ్మగోరూ ?" అన్నారు. అనసూయను చూసి.

వూ, వాళ్ళిద్దరూ మీ పిల్లలా ?" అన్నది అనసూయ.

"కాదు అమ్మగోరు. వాళ్ళ తండ్రి తాగుబోతుముండావోడు. తల్లి అల్లని

వదిలేసి ఎటో పోయింది. ఈళ్ళు తిండిలేక మాడుతూంటే చూళ్ళేక మాతో తీసుకపోతున్నాం. మగాడు ఎట్టున్నా బోతాడు. ఆడదానికేనా బుద్ధుండద్దా ? మాకు కావల్సినోళ్ళే లెండి'' అన్నది భార్య. దూరంగావున్న ముసలితాత దగ్గుతూ లేచి నిలబడ్డాడు.

''ఈకాలంవోళ్ళే అంత మా రాజు తల్లీ ? ఈ సదువులొచ్చినాక ఆడోళ్ళకి తిరబుద్ధి పోనాది. వూ, మాసెడ్డగ్గర పెరిగిపోనాది. నా భార్య వుండేది. చుక్కల సొచ్చిగా చెపుతుండా. నే గనుక కళ్ళెర్రజేత్తే నా కాళ్ళ క్రిందే పడివుండేది. అదే ఇప్పుడయితేనా, సినెమాలో జేరిపోతానని లగెత్తుకపోను'' అన్నాడు ముసలితాత కాషాయరంగులో ధర్మసత్రపు ముద్రవేసివున్న బనీనుజేబిలో నుంచి చుట్టలకట్ట తీస్తూ. ఆకాశంవేపు చూసింది అనసూయ. సాక్ష్యానికి ఒక చుక్కా కనపడటంలేదు. మబ్బులు దూర దూరంగా జరుగుతున్నాయ్ అలిగిన భార్యకు మల్లే. రాజా జానకి కళ్ళల్లో మసిలేరు. ఈపాటికయినా ఇంటికి జేర్తారనే నమ్మకం లేదు.

అయ్యో ? తలుపులు తీసొచ్చింది. తన కేసా పిచ్చిపట్టిందేమిటి ఖర్మ ? తెల్లవారినాక రాజునీ జానకినీ చూసినవాళ్ళంతా నన్నేం అనుకుంటారో ప్రత్యక్షానుభవం అయింది. తన పిల్లలు డబ్బూ తల్లీ వుండీకూడ లోకంచే అనాధలని పిలవబడే గతి తీసుక రాబోయింది. అయినకేం ? మహారాజు ! తను ఇంట్లో వుండకపోతే ఆ అరగంట కూడా ఏ స్నేహితులతోటో నిక్షేపంలా గడిపేస్తారు. ఆ హిందూ స్త్రీ మనోధర్మం ఆరాటపడసాగింది. తనకోసం తనే ప్రాకులాడాలి. తన పిల్లల వుజ్వల భవిష్యత్తు నాకాంక్షిస్తూ ఎప్పటికయినా వర్షించమని ''మేఘరాజు'' ని ప్రార్థిస్తూ గడపాలి. అందాకా విసురుకుంటుంటే వుక్క బోయకుండా వుంటుంది. కృతనిశ్చయురాలై ఇంటికి వచ్చేసింది అనసూయ. రామ్మూర్తి కిటికీ దగ్గరగా మంచంమీద గాఢనిద్రలో మునిగివున్నాడు. అలికిడికి రాజా బాబు లేచాడు.

''అమ్మా ? నన్ను తీసుకెళ్ళలేదు కదూ ? నేను రేపు వెళ్తానంతే'' అంటూ మొదలెట్టాడు.

జానకి అటూ ఇటూ దొర్లి మళ్ళీ పడుక్కుంది.

''వూహూ, ఏం సొద ! [illegible] పడుకోండి'' అన్నాడు రామ్మూర్తి నిద్రమత్తుగా.

''ఓ ? ఎక్కడికెళ్ళాన' అనేనా అడగరు. ఆకలేస్తే జానకిని లేపి అన్నం పెట్టించుకుంటారు. లేకపోతే లేనేలేదు'' అనుకుంది అనసూయ.

అతనివేపు కిటికీలోంచి నెమ్మదిగా చల్ల చల్లగా గాలి సోకుతున్నది. అనసూయకు మాత్రం మబ్బులు వర్షించక వుక్కపోయ సాగింది. ★

